పురపోరుపై నేతల అనాసక్తి 2

బాన్సువాడ అభివృద్ధే లక్ష్యంగా.. 2

AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర నాయకులుగా ముప్కాల్ ఉపాధ్యాయులు

అక్షరటుడే, ముప్కాల్: ముప్కాల్ మండల పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు రాష్ట్ర సంఘానికి ఎన్నికయ్యారు. ఈ మేరకు వారు శనివారం ప్రకటన విడుదల చేశారు. ముప్కాల్ ఉన్నత పాఠశాలకు చెందిన వన్నెల్ దాస్ నరేష్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా, తెడ్డు చిన్నయ్య రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా, రెంజర్ల ఉన్నత పాఠశాలకు చెందిన సుద్దపల్లి మల్లేష్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ ఎన్నికకు కృషి చేసిన రాష్ట్ర, జిల్లా పీఆర్‌టీయూ టీఎస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పొద్దుటూరి మోహన్ రెడ్డి, గంగోని కిషన్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

రుణాల రికవరీకి వెళ్లిన ఆర్పీపై దాడి

అక్షరటుడే, కామారెడ్డి : బ్యాంక్ మేనేజర్‌తో కలిసి రుణాల రికవరీ కోసం వెళ్లిన మెప్మా ఆర్పీపై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని అడ్లూర్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అడ్లూర్‌కు చెందిన చంద్రకళ కామారెడ్డి మెప్మాలో ఆర్పీగా పనిచేస్తోంది. అయితే గురువారం రాత్రి 7:30 గంటల ప్రాంతంలో ఐవోబీ బ్యాంక్ మేనేజర్ ఆర్పీకి ఫోన్‌చేసి లోన్ రికవరీ కోసం వెళ్లాలని చెప్పగా ఈ సమయంలో వీలు కాదని చెప్పింది. అయినా రావాల్సిందేనని చెప్పడంతో మేనేజర్‌తో పాటు స్కూటీపై వెళ్లింది. అయితే రుణం చెల్లించే వారి ఇంటికి తాళం వేసి ఉండడంతో మేనేజర్ వెళ్లిపోగా తన స్కూటీపై చంద్రకళ నెమ్మదిగా ఇంటికి వెళ్తోంది. ఆ సమయంలో ముఖానికి మాస్కులు ధరించిన ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు చంద్రకళను వెనకనుంచి తలపై కర్రతో దాడిచేసి పారిపోయారు. స్కూటీపై నుంచి కిందపడిన చంద్రకళ మళ్లీ తేరుకుని ఇంటికి వెళ్లింది. శుక్రవారం తలనొప్పిగా ఉండడంతో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లగా పరిస్థితి క్రిటికల్‌గా ఉందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఓ ప్రైవేటు ఆమెకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న తోటి ఆర్పీలు ఆస్పత్రికి చేరుకుని చంద్రకళను పరామర్శించారు. దాడికి గురైన ఆర్పీకి న్యాయం చేయాలని, చికిత్సకు అయ్యే ఖర్చు అధికారులు సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. రికవరీ కోసం తమను పిలవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని, తమకు న్యాయం జరిగే వరకు తమ విధులకు హాజరుకాబోమని తేల్చి చెప్పారు. ఈ విషయమై పీడీ శ్రీధర్ రెడ్డిని ఫోన్‌లో వివరణ కోరగా తాను వేరే చోట ఉన్నానని బదులిచ్చారు.

ఎల్లారెడ్డి మున్సిపాలిటీకీ భారీగా ఆదాయం

అక్షరటుడే,ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మున్సిపాలిటీకి నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మూడు రోజుల్లో భారీగా ఆదాయం సమకూరిందని మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం వివరాలు వెల్లడించారు. మున్సిపల్ నామినేషన్ల ప్రక్రియ 28న ప్రారంభం కావడంతో.. కౌన్సిలర్లుగా పోటీచేసే అభ్యర్థుల ఇంటి ట్యాక్స్‌తో పాటు మద్దతుదారుల ఇంటి ట్యాక్స్‌లుచెల్లించేందుకు ముందుకు వచ్చారు. మొదటి రోజు 28న రూ.2,08,491 ఆస్తి పన్ను, రూ.74,300 వాటర్ టాక్స్ కలిపి 2,82,791 ఆదాయం వచ్చింది. అలాగే రెండో రోజు 29న ఆస్తిపన్ను రూ.1,06,430, వాటర్ టాక్స్ రూ.53,025 కలిపి రూ.1,59,455 ఆదాయం సమకూరింది. మూడోరోజైన శనివారం రోజు 30న ఆస్తి పన్ను రూ.42,615, వాటర్ టాక్స్ రూ.31,175 కలిపి రూ.73,790 ఆదాయం వచ్చింది. మొత్తంగా 3 రోజుల్లో కలిపి ఆస్తిపన్ను రూ.3,57,536, వాటర్ టాక్స్ రూ.1,58,500 కలిపి మొత్తం రూ.5.50 లక్షల ఆదాయం వచ్చింది. మున్సిపల్ పరిధిలో రోజుల తరబడి ఇంటింటికీ తిరిగినా ఇంటి ట్యాక్స్ కట్టడంలో జాప్యం చేస్తున్న తరుణంలో మున్సిపల్ ఎన్నికల పుణ్యమా అని బకాయిలు వసూలవ్వడంపై మున్సిపల్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. నామినేషన్లు వేసే అభ్యర్థుల నుంచి టాక్స్ వసూలు చేసేందుకు మున్సిపల్ మేనేజర్ వాసంతి, వార్డు అధికారులు అంజయ్య, సూర్యవర్ధన్, స్వామి, బిల్ కలెక్టర్ల బృందంతో కౌంటర్లు ఏర్పాటు చేసి బకాయిలు వసూలు చేశారు.

> **మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల పర్వం ముగిసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి రాజకీయ పార్టీ నుంచి ఆశావాహుల పోటీ తీవ్రంగా ఉంది. అయితే పార్టీ నుంచి అధికారికంగా ఎవరికి బీ ఫామ్ అందజేస్తారోననే ఉత్కంఠ అభ్యర్థుల్లో నెలకొంది. తమకే సీటు ఖరారు అవుతుందనే ఆశతో పలువురు ఆశావాహులు ఉన్నారు. బీ ఫామ్ అందజేయడానికి ఎక్కువ సమయం లేకపోవడంతో అభ్యర్థులు పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నారు.** - అక్షరటుడే, ఇందూరు, కామారెడ్డి

నిజామాబాద్ జిల్లాలో ఆర్మూర్, భీమ్‌గల్, బోధన్ మున్సిపాలిటీలతో పాటు నగరపాలక సంస్థకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల ఆశావాహులు జిల్లా వ్యాప్తంగా 1,729 నామినేషన్లను దాఖలు చేశారు. ప్రధానంగా నగరపాలక సంస్థ నుంచి ఏకంగా 976 నామినేషన్లను వేశారు. బోధన్‌లోనూ ఈసారి భారీగానే నామినేషన్లు వచ్చాయి. తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా వేయని అభ్యర్థులు చివరి రెండు రోజుల్లో.. ఏకంగా 342 నామినేషన్లను వేశారు. అలాగే ఆర్మూర్‌లో 298, భీమ్‌గల్‌లో 113 నామినేషన్లను వేశారు.

బరిలో నిలిచేదెవరో?

■ పార్టీ బీ ఫాం కోసం ఎదురుచూపులు ■ ఒక్కో పార్టీ నుంచి పదుల సంఖ్యలో అభ్యర్థుల నామినేషన్ ■ టికెట్‌పై ఉత్కంఠ

సీటు ఖరారుపై మల్లగుల్లాలు

నామినేషన్ల పర్వం ముగియడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు బీఫామ్ కోసం ఎదురుచూస్తున్నారు. ఉపసంహరణకు మరో రెండు రోజుల సమయం మాత్రమే ఉండటంతో ఆయా పార్టీల అభ్యర్థులు పార్టీ నేతలు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఒక్కో డివిజన్ నుంచి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు పోటీ తీవ్రంగా ఉంది. అయితే కొందరు నాయకులు మాత్రం తమకు సీట్లు ఖరారు అయ్యాయని, పార్టీ పెద్దలు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారంటూ ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అదే డివిజన్‌కు చెందిన కొందరు అభ్యర్థులు స్వతంత్రంగా పోటీ చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు.

రెబల్స్ బెడద

నిజామాబాద్, బోధన్‌లో కాంగ్రెస్, బీజేపీతో పాటు ఎంఐఎంకు ప్రతి డివిజన్లో ఆశావాహులు పదుల సంఖ్యలో ఉన్నారు. దీంతో బీ ఫామ్ అందని అభ్యర్థులతో పార్టీలకు తలనొప్పిగా మారింది. పార్టీ నుంచి బీఫామ్ అందని నేపథ్యంలో రెబల్‌గా పోటీ చేసే యోచనలో పలువురున్నారు. దీంతో అటువంటి

హాట్ టాపిక్‌గా కామారెడ్డి..

దాంతో బీఫాం ఇచ్చేది ఎవరికి అనే ఉత్కంఠ నెలకొంది. బీజేపీ, బీఆర్ఎస్ నుంచి పెద్దగా పోటీ కనిపించడం లేదు. కాంగ్రెస్ పార్టీలో రెబల్స్ బెడద తప్పేలా కనిపించడం లేదు. ముఖ్యంగా కామారెడ్డిలో భిన్న వాతావరణం నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నుంచి సీఎం రేవంత్ రెడ్డి పోటీ చేయడం, నిజామాబాద్‌తో పాటు కామారెడ్డి ఇన్చార్జిగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తుండటంతో అందరి చూపు కామారెడ్డి పైనే ఉంది. కామారెడ్డిలో ఎలాంటి ఫలితం వచ్చినా హాట్ టాపిక్‌గా మారనుంది.

అభ్యర్థులను బుజ్జగించే పనిలో పార్టీ పెద్దలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇది ఇలా ఉండగా ఆదివారం రాత్రిలోగా ప్రధాన పార్టీల బీఫాంలు అభ్యర్థులకు అందుతాయని పలువురు నాయకులు చర్చించుకుంటున్నారు.

కామారెడ్డిలో పోటాపోటీ

కామారెడ్డి మున్సిపాలిటీలోని ప్రధాన పార్టీలో పోటీ నెలకొంది. ఒక్కో వార్డుకు పది మంది వరకు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి ముక్కోణపు పోటీ ఉండనుంది. మూడు రోజుల్లో 92 వార్డులకు 1,001 నామినేషన్లు దాఖలు చేశారు.
కామారెడ్డి మున్సిపాలిటీలో 523, ఎల్లారెడ్డిలో 88, బాన్సువాడలో 250, బిచ్కుంద మున్సిపాలిటీలో 140 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎన్నికల్లో పోటీకి అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి అత్యధిక నామినేషన్లు దాఖలయ్యాయి. ఒక్కో వార్డు నుంచి దాదాపు నలుగురు నామినేషన్ దాఖలు చేసినట్టుగా తెలుస్తోంది.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు ఏర్పాట్లు

అక్షరటుడే, ఇందూరు: ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలకు పూర్తి ఏర్పాట్లు చేసినట్లు డీఐఈవో రవికుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఖిల్లా బాలుర జూనియర్ కళాశాలలో సీఎస్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ.. ఫిబ్రవరి 2 నుంచి 21వ తేదీ వరకు విడతల వారీగా ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 57 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ పని చేయాల్సి ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రాక్టికల్స్ నిర్వహణలో సమస్యలు తలెత్తితే ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులను సంప్రదించాలన్నారు. పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు కౌసర్ పాషా, నూస్రత్ జహాన్, రజియా సుల్తానా, ప్రిన్సిపాళ్లు చిన్నయ్య, బుద్ధిరాజ్ పాల్గొన్నారు.

నామినేషన్ తిరస్కరణపై ఎంఐఎం ఆందోళన..

అక్షరటుడే, బోధన్ : మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఎంఐఎం అభ్యర్థి నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారు. దీంతో ఆ పార్టీ నాయకులు బోధన్ మున్సిపాలిటీ వద్ద ఆందోళనకు దిగారు. ఎంఐఎం బోధన్ పట్టణ అధ్యక్షుడు మీర్ ఇలియాస్ అలీ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ నాయకులు శనివారం మున్సిపాలిటీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నామినేషన్ తిరస్కృతిపై వివరాలు తెలుసుకున్న ఆ పార్టీ హైదరాబాద్ ఎమ్మెల్సీ మీర్జా రెహమత్ బేగ్ హుటాహుటిన బోధన్ వచ్చి సబ్ కలెక్టర్ వికాస్ మహతోతో మాట్లాడారు. ఎంఐఎం బోధన్ పట్టణ అధ్యక్షుడు మీర్ ఇలియాస్ అలీ వ్యాపార సంస్థలకు చెందిన టాక్స్ చెల్లించలేదనే కారణంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించినట్లు అధికారులు తెలిపారు. తమ నాయకుడి నామినేషన్ తిరస్కరించడంపై ఎంఐఎం పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్తులకు సంబంధించి పన్నులు నామినేషన్‌కు ముందే చెల్లించినప్పటికీ వాటిని అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేని నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై నామినేషన్ వేసే సందర్భంలో మున్సిపల్ కమిషనర్‌కు మీర్ ఇలియాస్ అలీ టాక్స్ చెల్లించినట్లు తెల్ల కాగితంపై రాసి కమిషనర్‌కు సైతం వివరించారని.. అయినప్పటికీ రిటర్నింగ్ అధికారుల వద్ద టాక్స్‌కు సంబంధించిన వివరాలు అందుబాటులో లేకపోవడంతో వారు నామినేషన్ తిరస్కరించారని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. నామినేషన్ తిరస్కృతిపై హైదరాబాద్‌కు చెందిన ఎంఐఎం ఎమ్మెల్సీ, సభ్యులు బోధన్ సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



ప్రజావాణి తాత్కాలికంగా వాయిదా

అక్షరటుడే, ఇందూరు: మున్సిపల్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ప్రజావాణిని వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం ఎప్పటిలాగే కొనసాగుతుందని తెలిపారు. జిల్లా ప్రజలు, పిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

సమ్మక్క–సారక్కను దర్శించుకున్న ఆర్మూర్ ఎమ్మెల్యే

అక్షరటుడే, ఆర్మూర్ : ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన మహోత్సవమైన సమ్మక్క సారక్క జాతర అత్యంత వైభవంగా జరుగుతోంది. తెలంగాణలోని ములుగు జిల్లా మేడారంలో ప్రతి రెండేళ్లకొకసారి కోయ తెగ ఆచారాల ప్రకారం ఈ జాతరను నిర్వహిస్తుంటారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తన సతీమణి పైడి రేవతి రెడ్డి, కుమార్తె సుచరిత రెడ్డితో కలిసి శనివారం మేడారం వెళ్లారు. వన దేవతలైన సమ్మక్క సారక్క దేవతలను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. నిలువెత్తు బంగారంతో మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పైడి రాకేష్ రెడ్డి ఫౌండేషన్ డైరెక్టర్ పైడి సుజాత రెడ్డి, సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కష్టపడి చదవాలి

అక్షరటుడే, బాన్సువాడ: విద్యార్థులు లక్ష్యసాధనకు కష్టపడి చదివి ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలు సాధించాలని బాన్సువాడ ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ ఇందూరు గంగాధర్ సూచించారు. బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి డిగ్రీ అడ్మిషన్లపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థులతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు వినయ్ కుమార్, చిరంజీవి, భగవాన్ రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

అక్షరటుడే, ఎల్లారెడ్డి: జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో 'మున్సిపల్ ఎన్నికల సమరానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధంగా ఉండాలని పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ సూచించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మున్సిపల్ ఎన్నికల ఇన్‌ఛార్జి మంత్రి అజహరుద్దీన్ నేతృత్వంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని నేతలకు దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేలా క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన వ్యూహాలపై చర్చించారు. ప్రజల్లోకి పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థంగా తీసుకెళ్లే విధానాలపై సమాలోచనలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లో కామారెడ్డిలోని అన్ని మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. టికెట్ ఎవరికి వచ్చినా పార్టీ క్యాడర్ మొత్తం ఏకతాటిపై ఉండాలని.. గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ్ రెడ్డి, కామారెడ్డి డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, అలాగే జహీరాబాద్ పార్లమెంట్‌లోని కార్పొరేషన్ ఛైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో క్రీడాప్రతిభను వెలికి తీసేందుకే సీఎం కప్ పోటీలు

అక్షరటుడే, ఎల్లారెడ్డి: సీఎం కప్ క్రీడా పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడతాయని ఎంపీడీవో తాహెరా బేగం అన్నారు. మాచాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సీఎం కప్ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎంతోమంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారి ప్రతిభను వెలికితీసేలా పోటీలు జరిగాయన్నారు. మండలస్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు జాతీయస్థాయిలో సైతం ప్రతిభ చూపేలా కృషి చేయాలని సూచించారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం ఇస్తుందని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఫిజికల్ డైరెక్టర్ లాల్‌సింగ్, స్వప్న, రత్న, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మెండోరాలో సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

అక్షరటుడే, మెండోరా: మండలంలోని దూదిగాం గ్రామంలో సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీడీవో లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మణ్ మాట్లాడుతూ.. క్రీడలు యువతకు మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని అందిస్తాయన్నారు. గ్రామీణ స్థాయిలో దాగి ఉన్న క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడానికి సీఎం కప్ పోటీలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, మెండోరా ఎస్సై సుహాసిని, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా నర్సయ్య

అక్షరటుడే, ఆర్మూర్: ఆర్మూర్ పట్టణ విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా చామంతి నర్సయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను విశ్వబ్రాహ్మణ సంఘం మామిడిపల్లి అధ్యక్షుడు శ్రీరామ్ వేణు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పద్దాజి గంగాధర్, శ్రీరాం రాజేష్, మాలెపు అరుణ్, మట్టెల రాజ్ కుమార్ , గంగాధర్, రవి తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలి

అక్షరటుడే, లింగంపేట: రైతులు రైతు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో సంతోష్ అన్నారు. మండలంలోని మలోత్ తండాలో శనివారం రైతు గుర్తింపు కార్డుల ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టాపాస్ పుస్తకం కలిగిన ప్రతి రైతు గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ పథకాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందాలంటే రైతు గుర్తింపు కార్డు ప్రామాణికంగా కానుందని వివరించారు. రైతులు తప్పనిసరిగా ఈ కార్డుకోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లోని మీ సేవ కేంద్రాలు, రైతువేదిక కార్యాలయంలో గాని సంప్రదించి గుర్తింపు కార్డుకు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న పథకాల గురించి అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి, రైతులు రామ్‌చంద్, మోహన్, సంతోష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పురపోరుపై నేతల అనాసక్తి

- రిజర్వేషన్లు కలిసిరాక కొందరు..
- స్వచ్ఛందంగా తప్పుకున్న మరికొందరు..
- ఆర్మూర్ మున్సిపల్ పోరులో విచిత్ర పరిస్థితి

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల జోష్ కనిపిస్తోంది. ఏ మున్సిపాలిటీలో చూసినా నలుగురు కలిస్తే మున్సిపల్ ఎన్నికలపైనే చర్చించుకుంటున్నారు. అయితే ఆర్మూర్ మున్సిపాలిటీలో చాలా ఏళ్లుగా చక్రం తిప్పిన నాయకులు ప్రస్తుత పురపోరుకు దూరంగా ఉంటున్నారు. దీంతో ఆర్మూర్ పట్టణంలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

– అక్షరటుడే, ఆర్మూర్

మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. అయితే చాలా ఏళ్లుగా ఆర్మూర్, మున్సిపాలిటీలో చక్రం తిప్పుతున్న అగ్ర నాయకులు మాత్రం ప్రస్తుత పురపోరులో పోటీకి దూరంగా ఉండడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలంటే చాలు పార్టీలపరంగా ముందుండి నడిచే నాయకులు ఈ ఎన్నికల్లో దూరంగా ఉంటున్నారు.

రిజర్వేషన్లు ఓవైపు.. స్వచ్ఛందంగా మరోవైపు..

బల్దియా ఎన్నికల్లో భాగంగా.. ఆయా పార్టీలకు సంబంధించి సీనియర్ నాయకులు తమకు అనుకూలమైన వార్డుల్లో రిజర్వేషన్లు రాలేదు. దీంతో వారు చేసేదేమీ లేక దూరంగా ఉన్నారు. మరికొందరు మాత్రం స్వచ్ఛందంగా పోటీ నుంచి తప్పుకున్నట్లు సమాచారం. ఆర్మూర్ మున్సిపల్‌లో ముఖ్యంగా బీజేపీ, అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య పోటీ నెలకొంది. కొన్ని వార్డుల్లో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ మరికొన్ని వార్డుల్లో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ మధ్య తీవ్ర పోటీ ఉంది. మరికొన్ని వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులు సైతం గట్టి పోటీ ఇవ్వనున్నారు. మరోవైపు వివిధ పార్టీల బీఫాంలు అందని నేతలు సైతం రెబల్స్‌గా పోటీలో నిలిచే ఆలోచనలో ఉన్నట్లుతెలుస్తోంది.

సీనియర్ నేతలు సైతం..

కాంగ్రెస్ పార్టీ నుంచి ముఖ్యంగా గతంలో ఆర్మూర్ మున్సిపల్ ఛైర్మన్, ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించిన వారు, బీజేపీ సీనియర్ నేతలు చాలామంది ఈసారి బల్దియా పోరులో వెనక్కి తగ్గారు. మరోవైపు వివిధ పార్టీల నుంచి నామినేషన్లు దాఖలు చేసిన సీనియర్లు సైతం బీఫాం వచ్చాకే చూద్దామని వేచి ఉన్నట్లు సమాచారం. కాగా.. ఈ ఎన్నికల్లో ఏ పార్టీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకొని మున్సిపాలిటీపై జెండా ఎగురేస్తుందో వేచిచూడాలి.

195 మంది నామినేషన్ల దాఖలు

ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో 36 వార్డులకు గాను 63,972 ఓటర్లు ఉండగా అందులో 33,322 మంది మహిళలు, 30,648 మంది పురుషులు, ఇద్దరు ఇతరులు ఉన్నారు. మొత్తంగా 195 అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఆప్ పార్టీ 4, బీఎస్పీ 5, బీజేపీ 73, సీపీఐఎంఎల్ 1, కాంగ్రెస్ 114, ఎంఐఎం 7, బీఆర్ఎస్ 65, స్వతంత్రులు 25 మొత్తంగా 298 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి.

నాళేశ్వర్‌లో శివరాత్రి సందర్భంగా క్రీడాపోటీలు ప్రారంభం

అక్షరటుడే: బోధన్: మహాశివరాత్రి సందర్భంగా నాళేశ్వర్‌లో యువత కోసం క్రికెట్ టోర్నీని సర్పంచ్ ఆర్మూర్ లావణ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. యువతీయువకులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం మాజీ సొసైటీ ఛైర్మన్ మగ్గరి హన్మాండ్లు మాట్లాడుతూ.. ఏడేళ్లుగా క్రమం తప్పకుండా శివరాత్రి సందర్భంగా క్రికెట్, వాలీబాల్ పోటీల నిర్వహణకు సహకరిస్తున్న నాళేశ్వర్ యువతకు అభినందనలు తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని.. క్రీడాస్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. క్రీడలో గెలిచిన క్రీడాకారులకు మహాశివరాత్రి రోజు బహుమతులు అందజేస్తామన్నారు. వీడీసీ సభ్యుడు కుమ్మరి రాజు మాట్లాడుతూ.. యువత క్రీడలకు ఎల్లవేళలా సహాయసహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆర్మూర్ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల యువజన

అధ్యక్షుడు చిన్నదొడ్డి ప్రవీణ్, మాజీ సర్పంచ్ ద్యాగ సరీన్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సురేష్, రాజు, జనార్దన్, సంజీవ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మేజర్ గ్రామ పంచాయతీగా గుర్తింపు పొందిన బాన్సువాడను 2018లో పురపాలికగా అప్‌గ్రేడ్ చేశారు. అప్పటి నుంచి అభివృద్ధే లక్ష్యంగా పట్టణం దూసుకెళ్తోంది. అయితే పలు ప్రాంతాల్లో ఇంకా సమస్యలు ఉన్నాయి. దీంతో ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తాము గెలిస్తే చేపట్టే అభివృద్ధి పనులపై పలు హామీలు ఇస్తున్నారు.

– అక్షరటుడే, బాన్సువాడ

బాన్సువాడ అభివృద్ధే లక్ష్యం

- గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తాం
- ప్రజలకు హామీలు ఇస్తున్న అభ్యర్థులు

ప్రస్తుతం బాన్సువాడ మున్సిపాలిటీలో మొత్తం 19 వార్డులు ఉన్నాయి. మొత్తం ఓటర్ల సంఖ్య 24,188 కాగా, ఇందులో పురుషులు 11,578, మహిళలు 12,599, ఇతరులు 11 మంది ఉన్నారు. మున్సిపల్ఎన్నికల్లో గెలుపు కోసం అభ్యర్థులు శ్రమిస్తున్నారు.

రూ. 200 కోట్లతో పట్టణ అభివృద్ధి..

గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 19 వార్డులకు గాను 17 వార్డులను కైవసం చేసుకుంది. ఐదేళ్ల పాలనలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పట్టణ అభివృద్ధికి ఎస్‌డీఎఫ్ నిధుల రూపంలో సుమారు రూ. 200 కోట్లు తీసుకొచ్చారు. ఈ నిధులతో పట్టణంలోని ప్రతి కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ, అంతర్గత రహదారులు అభివృద్ధి చేశారు. వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. పట్టణ ప్రజలు సేద తీరేందుకు ఒక ఉద్యానవనం, ఒక చిల్డ్రన్స్ పార్కును ఏర్పాటు చేశారు. అత్యాధునిక హంగులతో వైకుంఠధామం, ప్రభుత్వ కార్యాలయాల భవనాలు నిర్మించారు. 3,000 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు.

గ్రంథాలయం లేక ఇబ్బందులు..

బీఆర్ఎస్ హయాంలో పట్టణానికి గ్రంథాలయానికి రూ.40లక్షలు మంజూరయ్యాయి. అయితే ప్రభుత్వం మారడంతో భవన నిర్మాణం జరగలేదు. కొత్త సర్కారు వచ్చి రెండేళ్లయినా భవనం నిర్మించకపోవడంతో ప్రస్తుతం స్టేడియంలో లైబ్రరీ నిర్వహిస్తున్నారు. అలాగే సాయి నగర్‌లో మురుగు, రోడ్ల సమస్య తీవ్రంగా ఉంది. నిధులు మంజూరైనా పనులు నిలిచిపోయాయి.

మరింత అభివృద్ధి కోసం ప్రయత్నం..

పట్టణంలోని 19వార్డుల్లోనూ చెప్పుకోదగ్గ అభివృద్ధి జరిగినప్పటికీ ఏ చిన్న సమస్య ఉన్నా తాము ముందుంటామని ప్రస్తుత కౌన్సిలర్ అభ్యర్థులు పేర్కొంటున్నారు. ఈ విధంగానే మున్సిపాలిటీలో ప్రచారం చేసుకుంటున్నారు. పట్టణంలో మిగిలిపోయిన పనులను పూర్తిచేసి పట్టణాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ప్రజలకు హామీ ఇస్తున్నారు.

తాజాగా మారిన వ్యూహాలు..

ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని అనుసరిస్తున్న నాయకులు పలువురు కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఆయన వెంటే మేమున్నామంటూ వార్డుల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బీఫాంల కోసం తీవ్ర పోటీ నెలకొంది. బాన్సువాడ రాజకీయ వాతావరణం ఉత్కంఠగా మారింది.

బీఆర్ఎస్, బీజేపీ వ్యూహం ఏమిటి?

గత ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బీఆర్ఎస్, ప్రస్తుతం పార్టీ మార్పులతో కొంత బలహీనంగా కనిపిస్తున్నా, అభివృద్ధి పనుల క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు బీజేపీ స్థానికంగా నెమ్మదిగా సంస్థాగత బలాన్ని పెంచుకుంటూ, అసంతృప్త వర్గాలను ఆకర్షించే వ్యూహంతో ముందుకు సాగుతోంది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: ఎంవీఐ రాహుల్ కుమార్

అక్షరటుడే, ఆర్మూర్: వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆర్మూర్ ఎంవీఐ రాహుల్ కుమార్ అన్నారు. జాతీయ ట్రాఫిక్ మాసోత్సవాల్లో భాగంగా ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్, ట్రాఫిక్ ఎస్సై రఘుపతి, కళాశాల ప్రిన్సిపాల్ తిరుక్కోవెల వేణుగోపాలస్వామి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువుల్లో తుంగపై డ్రోన్‌తో పిచికారీ

అక్షరటుడే, ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని నల్ల పోచమ్మ గుడి, మల్లారెడ్డి చెరువు పరిసరాల్లోని తుంగపై శనివారం డ్రోన్‌లో మందును పిచికారీ చేశారు. మున్నూరు కాపు మూడు పంథాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తుంగతో ప్రాణహాని ఉందని ఇటీవల పర్యావరణవేత్తలు సూచించడంతో నివారణ మందును పిచికారీ చేయించినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో మూడు పంథాల సభ్యులు తెడ్డు బాల్ రెడ్డి, గోర్త దేవేందర్, బండి పోశెట్టి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ

అక్షరటుడే, కోటగిరి : పోతంగల్‌లో శనివారం బీఆర్ఎస్ క్యాలెండర్లు, డైరీలను పార్టీ మండలాధ్యక్షుడు సుధాం నవీన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలు పడి, రైతన్నలు నష్టపోయినా పంటకు పరిహారం ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అన్ని వర్గాల ప్రజలను ఆదుకున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు డబ్బులు వేయడంలో కాలయాపన చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హరీష్, సాయిలు, గంధపు గంగాధర్, ఘన్‌శ్యాం, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

అక్షరటుడే, బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న మూడో తరగతి విద్యార్థిని శివశ్రీ శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో స్పందించిన సర్పంచ్ అరిగే ధర్మతేజ, బీర్కూర్ ఎస్సై మహేందర్ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు శనివారం సర్పంచ్ , ఎస్సై ఇద్దరూ రూ.5వేల చొప్పున మొత్తం రూ.10వేల నగదు సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో భూమయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.